RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 277 ఆదివారం 23 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-


### గచ్చిబౌలి విషాదంపై హైడ్రా సీరియస్.. అక్రమ భవనాలన్నీ కూల్చేస్తాం: కమిషనర్

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో చోటు చేసుకున్న భవన కూల్చివేత ఘటన నగరంలో కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెంటనే స్పందించి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిబంధనలను తుంగలో తొక్కి నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను ఎలాంటి వెనుకంజ లేకుండా నేలమట్టం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం యాభై గజాల స్థలంలో ఏడంతస్తుల నిర్మాణం చేపట్టడమే కాకుండా, అదనంగా పెంట్‌హౌస్ నిర్మించడం వల్లే ఈ పెను ప్రమాదం ముసరికొచ్చిందని ప్రాథమిక విచారణలో తేలింది.

### తెలంగాణ మీదుగా రూ. 7,000 కోట్లతో ఎల్పీజీ పైప్‌లైన్లు..!!

దేశంలో ఇంధన భద్రతను పటిష్టం చేయడంతో పాటు గృహావసరాలకు సురక్షితంగా LPG గ్యాస్ సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం, నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర 3 వ్యూహాత్మక LPG పైప్‌లైన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 7,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ రంగ దిగ్గజం ఈ భారీ ప్రాజెక్టును చేపట్టనుంది. తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల మీదుగా ఈ నెట్‌వర్క్ విస్తరించనుంది.

# 'రిజర్వేషన్ హటావో' ఉద్యమం




## అసలు అయ్యేపనేనా? దీంట్లో సమస్యలేంటి?

- రిజర్వేషన్ రద్దు ఆచరణసాధ్యమా?
- రాజ్యాంగం, రాజకీయాల సంక్లిష్టతలు
- ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం ఏది?

> దేశంలో ఇటీవల 'రిజర్వేషన్ హటావో' పేరుతో ప్రారంభమైన ఉద్యమం సామాజిక, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యా అర్హతలు, పుష్కలమైన ఆర్థిక వనరులు, ఉద్యోగాలు ఉన్న కుటుంబాలకు కూడా కేవలం కులం ప్రాతిపదికన తరతరాలుగా రిజర్వేషన్లు వర్తింపజేయ డం ఎంత వరకు సమంజసమనే ప్రశ్నను ఈ ఉద్యమం లేవనెత్తు తోంది. అయితే దశాబ్దాలుగా రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల ను ఒక బలమైన ఓటు బ్యాంకు ఆయుధంగానే వాడుకుంటున్నాయి.

ఈ నేపథ్యంలో, వర్గాల మధ్య సమతుల్యత దెబ్బతింటుందనే భయంతో ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా రిజర్వేషన్ల రద్దుకు సుముఖత చూపకపోవడం ఈ డిమాండ్ నెరవేరడానికి ప్రధాన ప్రతిబంధకం గా మారింది. రిజర్వేషన్ల రద్దు లేదా మార్పుల విషయంలో చట్టపరమైన, రాజ్యాంగపరమైన సవాళ్లు అత్యంత సంక్లిష్టంగా నిలుస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం దేశంలో రిజర్వేషన్లపై 50 శాతం గరిష్ట పరిమితి (క్యాప్) అమలులో ఉంది. మరొకవైపు, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా కొత్త చట్టాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ పరిణామాల మధ్య ఇప్పటికే ఉన్న సామాజిక వర్గాల రక్షణలను తొలగించడం లేదా రాజ్యాంగ సవరణలు తీసుకురావడం సామాన్యమైన విషయం కాదు. చట్టపరమైన భద్రత ఉన్నందున కేవలం నిరసనల ద్వారా వ్యవస్థలో మార్పులు తేవడం అసాధ్యమనే వాదన బలంగా వినిపిస్తోంది. ఒకవేళ సాంప్రదాయ రిజర్వేషన్ల విధానంలో సమూల మార్పులు తీసుకురావాలనుకున్నా, వెనుకబడిన వర్గాలకు అన్యాయం జరగకుండా అందరికీ ఆమోదయోగ్యమైన పక్కా బ్లూ ప్రింట్ రూపుదిద్దుకోవాల్సి ఉంటుంది. కేవలం కులాన్ని మాత్రమే కొలమానంగా తీసుకోకుండా, క్షేత్రస్థాయిలోని ఆర్థిక స్థితిగతులు, సామాజిక వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకునే సరికొత్త వ్యవస్థను రూపొందించాలి.

2లో



# గతంలో కాపాడాం...

## కొండా సురేఖ VS కాంగ్రెస్..

### టీపీసీసీ చీఫ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కీలక వ్యాఖ్యలు

తెలంగాణలో సంచలనంగా మారిన కొండా సురేఖ ఎపిసోడ్ పై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో మాట్లాడుతూ.. కొండా సురేఖను గతంలో కాపాడమని ఇప్పుడు కాపాడే ఛాన్సే లేదని తేల్చి చెప్పారు. పార్టీ లైన్ ను ఎవరూ దాటిన చర్యలు తప్పవన్నారు. కొండా సురేఖ కూతురు సుస్మిత లైన్ దాటి నేరుగా సీఎం రేవంత్ రెడ్డిపైనే ఆరోపణలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. అటు అదిష్టానం సైతం కొండా సురేఖపై సీరియస్ గా ఉందని తేల్చి చెప్పారు.

## గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా హైదరాబాద్..

### కేంబ్రిడ్జ్‌తో సీఎం రేవంత్ రెడ్డి బృందం కీలక భేటీ!

# కేంబ్రిడ్జ్ వర్గాలు సముఖత



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి లండన్ పర్యటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అక్కడి ప్రముఖ కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి బృంధం భేటి అయ్యింది. తెలంగాణలో విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై ఈ భేటిలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను సీఎం రేవంత్ రెడ్డి కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందులో భాగస్వాములు కావాలని ఆహ్వానించారు.

2లో

# 70 కోట్ల మంది మహిళలే నా బలం

## 'ఛత్రోన్ కీ గూంజ్'లో రాహుల్ హాట్ కామెంట్స్

- మహిళలే నా ప్రాథమిక బలం
- స్త్రీలకు సొంత గుర్తింపు అవసరం
- పురుషుల కంటే దూరదృష్టి ఎక్కువ



**భారతదేశంలోని 70 కోట్ల మంది మహిళలే తన అతిపెద్ద బలమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పూణెలో నిర్వహించిన 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమానికి హాజరైన ఆయన మహిళా విద్యార్థులను ఉద్దేశించి ఉత్సాహభరితంగా ప్రసంగించారు.**

2లో

# మారుతున్న వాతావరణం..

## తెలుగు రాష్ట్రాల్లో 3 రోజులు వర్షాలు.. వాతావరణ శాఖ బిగ్ అలర్ట్

- బంగాళాఖాతంలో కొత్త అల్పపీడన ప్రాంతం
- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు
- గంటకు యాభై కిలోమీటర్ల గాలులు




2లో

# సీజేపీ అధినేత అభిజీత్ దీప్కేపై కేసు..

## హెడ్‌మాస్టర్‌కు బెదిరింపులు.. పోలీసుల సీరియస్ యాక్షన్

### అనుమతి లేకుండా పాఠశాలలో ప్రత్యక్షం
### తరగతి గది విధులకు అంతరాయం
### ఉపాధ్యాయులపై బెదిరింపుల ఆరోపణలు

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తో పాటు మరికొందరిపై మహారాష్ట్రలోని లాతూర్ జిల్లాలో పోలీసులు విధులకు అంతరాయం కలిగించినందుకు కేసు నమోదు చేశారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రభుత్వ పాఠశాలలోకి ప్రవేశించి, తరగతుల నిర్వహణకు విఘాతం కలిగించడమే కాకుండా ఉపాధ్యాయులను బెదిరించారనే తీవ్ర ఆరోపణలతో ఆసా పోలీస్ స్టేషన్‌లో ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. జవళి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలు సయ్యద్ షమ్షద్‌బానో ఖైరతాలీ (53) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అధికారిక చర్యలు చేపట్టారు. సీజేపీ చేపట్టిన 'స్కూల్ ఠీక్ కరో'



2లో

# గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం

## కుప్పకూలిన ఏడంతస్తుల భవనం. ఇద్దరు మృతి..

- గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం
- శిథిలాల కింద చిక్కుకుని ఇద్దరు మృతి
- ఘటనా స్థలంలో రెస్క్యూ ఆపరేషన్



హైదరాబాద్ ఐటీ కారిడార్ లోని గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నాలాను ఆనుకుని కేవలం 50 గజాల చిన్న స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఇటీవలే నిర్మాణం పూర్తయి అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఈ భవనం అకస్మాత్తుగా పక్కకు వాలిపోవడంతో అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకుని మృతి చెందారు. భవనం కూలిన శబ్దానికి సమీపంలోని హాస్టల్ విద్యార్థులు, వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్ వాసులు ప్రాణభయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, GHMC, HYDRAA రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశాయి.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.



3లో

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక

ఆదివారం
23 -08-2026

## సంపాదకీయం

# మళ్లీ ఎజెండాలోకి జవాబుదారీతనం?

పార్లమెంటు సమావేశాల ముగింపునకు ముందు రోజు చాలా విడ్డూరమైన పరిస్థితి. సర్వశక్తివంతుడైన హోంశాఖామాత్యులు అమిత్ షా మీడియా ఛానళ్లలో మాట్లాడే ముందు నిస్సహాయంగా వాపోయారు. లోక్‌సభకు వెళ్లడంలో అర్థమేముంది అని విషాద స్వరంతో ప్రశ్నిస్తున్నారు. సందర్భవశాత్తూ ఇక్కడో మాట చెప్పాలి. మొత్తం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు చెప్పుకోదగిన కార్యక్రమాలేవీ నిర్వహించకుండానే తుడిచిపెట్టుకుపోయాయి. జులై 20న జంతర్ మంతర్ వద్ద శాంతియుత నిరసన తెల్పుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు వ్యవహరించిన తీరుకు సంబంధించి అమిత్ షా సభకు వచ్చి ఒక వివరణ ఇవ్వడానికి నిరాకరించడమే ఇందుకు కారణం.? ఒక శాంతియుత నిరసన సాగుతుంటే ఢిల్లీ పోలీసులు అత్యంత పాశవికంగా వ్యవహరించారు. విచక్షణా రహితంగా బాష్పవాయు ప్రయోగం చేశారు. సాదా దుస్తుల్లో వచ్చిన పోలీసులు తమ నామఫలకాలు కూడా లేకుండా చొరబడి విషపూరితమైన లాఠీ చార్జికి పాల్పడ్డమేగాక ముళ్ల బెత్తాలు కూడా ఉపయోగించారు. మహిళల మర్మాంగాలపై దాడి చేశారు. పెల్లెట్ తుపాకులు ఉపయోగించారు. ట్రక్కుల కొద్దీ రాళ్లు తీసుకొచ్చి నిలిపారు. తర్వాత వాటిని చూపించి విద్యార్థులే హింసాకాండకు పాల్పడినట్టు చిత్రించాలనుకున్నారు. ఈ మాయోపాయాలలో ప్రతి ఒకదానికీ ఆధారాలతో సహా తర్వాత కన్నంలోనే దొరికిపోయారు. సరే కొత్తగా నియోగించినవేమంటే ఎలక్ట్రానిక్ డ్రాగ్నెట్లు. వాటి సాయంతో నిరసనకారుల గుర్తింపును డిజిటల్‌గా రికార్డు చేసి అట్టిపెట్టాలని చూశారు. ఈ ఆయుధాలలో దేనికీ చట్టబద్ధమైన ఆమోదం లేదనేది వేరే విషయం. కనుక అమిత్ షా పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్టు తయారైందనేది స్పష్టం. మొదటగా తనను హోంమంత్రిగా నియమించడానికి లోక్‌సభనే కారణమన్నది ఆయన మర్చిపోయారు. కనుక ఆయన సభకు జవాబు చెప్పవలసిన బాధ్యత నుంచి తప్పించుకోలేరు. జులై 20న ఆ తర్వాత విద్యార్థుల పట్ల అంత అమానుషంగా ప్రవర్తించడానికి బాధ్యులెవరనేదానిపై సభకు సమాచారం అందించి తెలియపర్చాల్సిన బాధ్యత తనదే.? విషయాలు అటూ ఇటూ తిప్పేసి పోలీసు చర్యకు నిజంగా బాధ్యులెవరనే ప్రశ్నకు జవాబు చెప్పకుండా దాటేసే స్వేచ్ఛ ఆయనకు వుండదు. ఇది ఈయనకో రివాజుగా మారిపోయింది. 2025 ఏప్రిల్ 22న దురదృష్టకరమైన ఆ మధ్యాహ్నం టెర్రరిస్టులెలా చొరబడి 28 మంది అమాయకులను బలి తీసుకోగలిగారనే దానికి కూడా ఇలాగే ఆయన జవాబు దాటేశారు. ఇప్పటికీ దానికి జవాబుల కోసం బతిమాలుకోవలసిన పరిస్థితే కొనసాగుతున్నది. ఇప్పుడు వాతావరణం మారిపోయింది. ఆయన జవాబుదారీతనం చూపించాల్సిన బాధ్యత మిగిలే వుంది. కానీ సర్కారు పూర్తి ఇరకాటంలో చిక్కుకుపోయి వుంది. సమాధానమిచ్చి మూల్యం చెల్లించడమా లేక జవాబుదారీతనం కోసం ఒత్తిడి పెరిగినా కూడా మౌనం పాటించి బయిటపడటమా అనే పరిస్థితి. ఈ విషయంలో బాధ్యత నుంచి తప్పుకోవడం సాధ్యం కాదనడానికి ధర్మేంద్ర ప్రధాన్ బలవంతంగా రాజీనామా చేయవలసి రావడమే ఒక ఒప్పుకోలు. అయితే నీట్ రద్దుపై నివేదిక గనక చూస్తే వాస్తవంగా మారిందేమీ లేదని అర్థమవుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేసేవరకూ పరీక్షల నిర్వహణలో ఈ విపరీత కేంద్రీకరణ దెబ్బతినడం అనివార్యం. విద్యార్థి శిక్షణ లేకుండా ప్రవేశ ప్రక్రియ, అర్హత పరీక్షను ఎదుర్కోలేని పరిస్థితి మారకుండా పాఠశాల వ్యవస్థ మెరుగుపడబోదని మోడీనే స్వయంగా అంగీకరించవలసి వచ్చింది. ఎర్రకోట పైనుంచి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఆయనీ మాట ఒప్పుకున్నారు. దేశవ్యాపితంగా దాదాపు 94,000 స్కూళ్లు మూతపడ్డాయని ప్రభుత్వం అధికారికంగా ఒప్పుకోవలసి వచ్చిన పరిస్థితిని ఎవరు ఖండించగలరు? ఈ మూసివేత అన్నది వ్యవస్థను పటిష్టపరిచే క్రమంలో ఒక భాగమని జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) వాదించింది. ఎన్ఇపి అమలు మొదలై ఇప్పుడు ఏడో సంవత్సరం. అయినా అదనపు శిక్షణ లేకుండా విద్యార్థుల ఫలితాలు వాటికవే నిరూపించుకోవడం సాధ్యపడటం లేదు. ఈలోగా సుప్రీంకోర్టు స్వయంగా రంగంలోకి దిగి జులై 20 పోలీసు హింసాకాండపై సంజాయిషీ కోరవలసి వచ్చింది. ఇదేవిధంగా ప్రతి శాంతియుత నిరసనను నేరపూరితంగా చూపించే మోడీ సర్కారు రివాజు ఇంకేమ్రాతం తుడిచిపారేయలేని పరిస్థితి వచ్చేసింది. భయం అన్నది వెనక్కుపోయి సామూహిక సాహసంతో నిలబడే వాతావరణంలో కొత్త గాలులు ఊపిరి పోసుకోవడం సంతోషకరమైన పరిణామం. కేవలం సర్కారీ యంత్రాంగానికేగాక న్యాయ వ్యవస్థకు కూడా సెగ తగిలింది. తమ యాజమాన్యం భారత ప్రధాన న్యాయమూర్తికి ఆహ్వానం పంపడాన్ని నల్సార్ విద్యార్థులు బహిరంగంగా నిరసించారు. మొదటైతే ఏదో మిన్ను విరిగిపడినట్టు స్పందించారు! కానీ తర్వాత మరో జాతీయ న్యాయ విద్యాలయ విద్యార్థులు కూడా అదే విధమైన నిరసనను పునరావృతం చేశారు. పాలక పార్టీ హంగుదారుడు బార్ కౌన్సిల్ అధ్యక్షుడైన రాజ్యసభ ఎంపీ ఒకరు నల్సార్ విద్యార్థులపై శిక్షా చర్య తీసుకుంటామని బెదిరించడంతో అన్ని వైపుల నుంచి విమర్శ వెల్లువెత్తింది. చివరకు మీరెందుకు అనవసరంగా తలదూర్చారని సిజెఐ స్వయంగా బిసిఐ అధ్యక్షుడిని మందలించవలసి వచ్చింది. బిజెపి నాయకత్వం తోక ముడవాల్సి వచ్చింది. బిసిఐ అధ్యక్షుడిని మందలించే సందర్భంలోనే సిజెఐ యువత అయినా, వృద్ధులైనా నిరసన అన్నది పౌరులకున్న అవిభాజ్యమైన హక్కు అని వ్యాఖ్యానించారు. ప్రజల దృష్టిలో న్యాయ వ్యవస్థ గనక విశ్వసనీయత, సమగ్రత, నిష్పాక్షికత కోల్పోతే దానికి విలువే వుండదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి మరొకరు సూటిగా చెప్పవలసి వచ్చింది. నేరుగా ప్రజలతో ఎన్నుకోబడనప్పటికీ రాజ్యాంగం ఉద్దేశించినట్టు అది ప్రజలకు జవాబుదారీగా వుండాలనే భావన న్యాయ వ్యవస్థలో ఉదయిస్తున్నది. ఏమైనా ఇప్పటికీ కళ్లు తెరవని ఒక రాజ్యాంగ వ్యవస్థ భారత ఎన్నికల కమిషన్. ప్రధాన మీడియాలో ప్రత్యేకించి చర్చనీయాంశంగా లేకున్నా సర్ ప్రక్రియ నివేదికలు మాత్రం వెలువడుతూనే వున్నాయి. సాఫ్ట్‌వేర్‌నూ అల్గోరిథమ్‌లను ఏ మాత్రం అంతుపట్టని రీతిలో ఉపయోగించడం వల్ల ఓటర్ల జాబితాల నుంచి పేర్లు ఎలా తొలగించబడుతున్నాయో చెబుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఇంత అలవోకగా లాగిపారేయడం ఏ విధంగానూ జవాబుదారీతనం కాదు. కనుక తమ రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం ప్రజలు నిలదొక్కుకోవడం, కార్యనిర్వాహక వర్గం, న్యాయ వ్యవస్థల నుంచి జవాబుదారీతనం కోరుతున్న కొత్త వాతావరణం ఇప్పుడు ఏర్పడింది. అందువల్ల ఇప్పుడు ఇసిఐ జవాబుదారీతనం వుండాలనే డిమాండు కూడా ప్రతిధ్వనించబోతున్నది. డోనాల్డ్ ట్రంప్ కితాబునిస్తే ఈ ఒత్తిడి ఆగిపోదు. పారదర్శకత, ఇతోధిక జవాబుదారీతనం కలిగిన వ్యవస్థ దిశగా మనం సాగిపోదాం. మన ప్రజాస్వామ్యానికి, అదే జీవరేఖ అవుతుంది. రాజ్యాంగ అమరికకు రక్షణగా నిలుస్తుంది.

# మారుతున్న వాతావరణం..

## తెలుగు రాష్ట్రాల్లో 3 రోజులు వర్షాలు.. వాతావరణ శాఖ బిగ్ అలర్ట్



ఉత్తర బంగాళాఖాతం, మయన్మార్ తీర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం తీవ్రంగా మారి, రాబోయే 24 గంటల్లో అల్పపీడనంగా రూపాంతరం చెందే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో నైరుతి రుతుపవన ద్రోణి మరింత బలపడటంతో తెలుగు రాష్ట్రాల్లో రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. ఉత్తర కోస్తాంధ్ర, యానాం పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడనున్నాయి. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమ జిల్లాల్లో ఈరోజు, రేపు తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని, ప్రజలు ముఖ్యంగా రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు మోస్తరు వర్షాలు కురుస్తాయి. రేపు, ఎల్లుండి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

# సీజేపీ అధినేత అభిజీత్ దీప్కేపై కేసు..

కార్యక్రమంలో భాగంగా అభిజీత్ దీప్కే బృందం లాతూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, అక్కడ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తోంది. అయితే, జవళి పాఠశాల పర్యటన సమయంలో ఆయన అనుమతి లేకుండా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థుల మధ్య కూర్చొని వారిని ప్రశ్నించడం వల్ల అధికారిక విధులకు తీవ్ర విఘాతం కలిగిందని ఉపాధ్యాయురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ జరిగిన దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాల సందర్శన సమయంలో ఇతర పాఠశాలల నుంచి విద్యార్థులను తెచ్చి ఇక్కడ కూర్చోబెట్టారని దీప్కే ఆరోపించారని, అంతేకాకుండా అక్కడి ఉపాధ్యాయులను విధుల నుంచి సస్పెండ్ చేయిస్తానని బెదిరించారని ఫిర్యాదులో వివరించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు స్పందించి, భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 132, 329(3), 351(2), 356(2) కింద కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# గతంలో కాపాడాం...

మరోవైపు ఇదే వివాదంపై గాంధీ భవన్ వద్ద కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి మాట్లాడారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణను పరిశీలించినట్లు చెప్పారు. అటు కూతురు సుస్మిత చేసిన కామెంట్స్ వీడియోస్ ను సైతం చూసినట్లు తెలిపారు. సీఎం రేవంత్ ను సాధారణ వ్యక్తిలాగా ఆమె అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు మల్లు రవి అన్నారు. అటు కొండా సురేఖకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు పెట్టిన ప్రెస్ మీట్ ను సైతం పరిశీలించామని.. ఇంకొంతమంది ఎమ్మెల్యేలు సైతం ఫిర్యాదు చేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. కొండా సురేఖ వివాదంపై ఇప్పుడే తుది నిర్ణయం తీసుకోలేమన్నారు. అయితే సొంత కూతురు మాట్లాడిన మాటలను కనీసం సురేఖ ఖండించలేదని మల్లు రవి విమర్శించారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం తనకు కూతురు చేసిన వ్యాఖ్యలతో సంబంధం లేదని మాత్రం ఆమె చెబుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు చిన్నారెడ్డి వివాదం గురించి కూడా మల్లు రవి మాట్లాడారు. విమర్శలపై చిన్నారెడ్డి ఇచ్చిన వివరణ పరిశీలించినట్లు చెప్పారు. మేఘా రెడ్డితో ఒకసారి మాట్లాడిన తర్వాత ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివాదస్పద వ్యాఖ్యలపైనా మల్లు రవి స్పందించారు. రాజగోపాల్ రెడ్డిపై ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదు రాలేదని.. సుమోటోగా తీసుకోవాలా? లేదా? అనేది పరిశీలిస్తున్నట్లు చెప్పారు. మట్నత్తం మీదా చిన్నారెడ్డి సీనియర్ నాయకుడు కావడం వల్ల, కొండా సురేఖ మంత్రిగా ఉండటం వల్ల నిర్ణయం తీసుకోవడం కాస్త ఆలస్యం అవుతోందని మల్లు రవి చెప్పుకొచ్చారు.

# సీనియర్ నటీ షావుకారు జానకి మృతి పట్ల సంతాపం

## –ఘనంగా నివాళులు అర్పించిన శ్రీ గౌతమ కళా సమితి



నిజామాబాద్, ఆగష్టు 22(ప్రజాగళం) : కళైమామని,పద్మశ్రీ షావుకారు జానకి మృతి పట్ల నిజామాబాద్ శ్రీ గౌతమ కళా సమితి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఇందూరు సీనియర్ నటులు, దర్శకులు శ్రీపాద కుమార శర్మ అధ్యక్షతన సమావేశమైయ్యారు. జిల్లా కేంద్రం లోని మాణిక్ భవన్ కళా వేదిక లో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్బంగా కళా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి తనకంటు ఓ ప్రత్యేక నటనతో హీరోయిన్ గా,ప్రముఖ నటులు ఎన్.టి.ఆర్., ఎ.ఎన్.ఆర్., ఎంజి.ఆర్., శివాజీ గణేషన్ లతో నటించి ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో క్యారక్టర్ నటిగా రాణించి, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళంలో ఎన్నో విజయవంతమైన చిత్రాలలో నటించారన్నారు. అనర్గలమైన వాక్ చాతుర్యంతో వ్యాఖ్యతగా కూడా పేరుపొంది, ఏడు పదుల సినీ జీవితంలో మచ్చలేని నటిగా గుర్తింపు పొందరన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమ కళాసమితి సభ్యులు, నటులు పి. రాములు, సుభాష్ రెడ్డి, వి.పి. చందన్ రావు కార్యదర్శి ఎన్.రఘు, తదితరులు పాల్గొన్నారు.

# 'రిజర్వేషన్ హటావో' ఉద్యమం

సమగ్రమైన డేటా, శాస్త్రీయ అధ్యయనం లేకుండా రిజర్వేషన్లను తొలగించాలని కోరడం వల్ల సామాజిక అసమానతలు మరింత హెచ్చరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ విధానమైనా సమాజంలోని చివరి వ్యక్తికి ఫలాలు అందించేలా ఉండటమే ప్రజాస్వామ్య సూత్రం. రిజర్వేషన్ల ఫలాలు నిజంగా అర్హులైన పేదలకు అందుతున్నాయా లేదా అనే దానిపై పునరాలోచన జరగాల్సిన అవసరం ఉంది. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, అన్ని వర్గాల సంక్షేమాన్ని కాపాడేలా ఒక పారదర్శకమైన విధానాన్ని తీసుకురావడమే ప్రస్తుతం ప్రభుత్వం, విధాన రూపకర్తల ముందున్న ప్రధాన సవాలు.

# 70 కోట్ల మంది మహిళలే నా బలం

## 'ఛత్రోన్ కీ గూంజ్'లో రాహుల్ హాట్ కామెంట్స్

మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా తమ సొంత కలలను సాకారం చేసుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పురుషుల కంటే మహిళల్లోనే ఎక్కువ సున్నితత్వం, సహనం, కరుణ మరియు భవిష్యత్తును సరిగ్గా అంచనా వేసే దూరదృష్టి ఉంటాయని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. సమాజంలో మహిళలను కేవలం తల్లిగా, భార్యగా లేదా కూతురిగా మాత్రమే చూడడం సరైన పద్ధతి కాదని రాహుల్ పేర్కొన్నారు. కుటుంబ పాత్రలు ముఖ్యమే అయినప్పటికీ, మహిళకు స్వతంత్ర గుర్తింపు ఉండటం అంతే అవసరమని చెప్పారు. కేవలం కుటుంబ సంబంధాలకే వారి పరిధిని పరిమితం చేయడం వల్ల వారిలోని పూర్తి నైపుణ్యాలు వెలుగులోకి రాకుండా పోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పురాతన మనుస్మృతి భావజాలం ప్రకారం మహిళలను ప్రతి దశలోనూ తండ్రి, భర్త లేదా కుమారుల నియంత్రణలోనే ఉంచాలనే ఆలోచన ఉందంటూ రాహుల్ విమర్శించారు. అలాంటి విధానాలు మహిళల స్వేచ్ఛకు విరుద్ధమని, తీవ్ర అవమానకరమని వ్యాఖ్యానించారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా, తమపై తాము నమ్మకం ఉంచుకుని స్వయంసమృద్ధి సాధించాలని, సమాజంలో తమ సొంత కాళ్లపై నిలబడాలని రాహుల్ గాంధీ హితవు పలికారు.

# కేంబ్రిడ్జ్ వర్గాలు సముఖత

సీఎం రేవంత్ పిలుపుపై కేంబ్రిడ్జ్ బిజినెస్ ప్రతినిధి బృందం సుముఖత వ్యక్తం చేసింది. కేంబ్రిడ్జ్ మార్కెటింగ్ ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, ప్రొఫెసర్ వెంకట శిరీష్ తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తికనబరిచారు. తెలంగాణలో ఉన్న అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఎంకు హామీ ఇచ్చారు. గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా హైదరాబాద్ఈ భేటిలో తెలంగాణ ప్రభుత్వం, కేంబ్రిడ్జ్ ప్రతినిధుల మధ్య కీలక అంగీకారం కుదిరింది. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడం, సంయుక్తంగా పరిశోధనలు చేపట్టడం, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఇంక్యుబేషన్, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాల్లో భాగస్వామ్యానికి ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న 'తెలంగాణ రైజింగ్' లక్ష్యానికి ఈ సమావేశం మరింత బలం చేకూరుస్తుందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

# గోల్కొండ కోట సమీపంలో 'రహస్య సొరంగం' కలకలం. పురావస్తు శాఖ అసలు నిజం ఏంటో చెప్పేసింది..



హైదరాబాద్‌లోని చారిత్రక గోల్కొండ కోట సమీపంలో రహస్య సొరంగం బయటపడింది. ఈ వార్తలపై పురావస్తు శాఖ స్పష్టత ఇచ్చింది. అక్కడ బయటపడింది సొరంగం కాదని.. గ్రానైట్ రాళ్లతో నిర్మించిన చిన్న దీర్ఘచతురస్రాకార గది అని తేల్చింది. గోల్కొండ కోట పరిధిలోని పటాన్‌చెరు దర్వాజా సమీపంలో, కుతుబ్ షామీ శ్మశాన వాటిక దగ్గర ఉన్న అతారా సీడీ వద్ద ఆర్మీ తవ్వకాల్లో భూగర్భంలో ఓ నిర్మాణం బయటపడింది. అగ్నివీర్ లకు శిక్షణ ఇచ్చేందుకు గోల్కొండ ఆర్టిలరీ అధికారులు పొక్లెయిన్ సహాయంతో భూమిని చదును చేస్తుండగా.. ఈ సొరంగం బయటపడింది. ఇది సొరంగం అని.. ఇక్కడి నుంచి చార్మినార్ కు డైరెక్ట్ దారి ఉందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. పురావస్తు శాఖ అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. చివరకు అది గోల్కొండ పాలకుల కాలంలో ఉపయోగించిన ఒక సీక్రెట్ గది అని తేల్చారు. బయటపడిన గది 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల పొడవు, 2.2 మీటర్ల లోతుతో రెక్టాంగెల్ షేప్ లో ఉందని, గ్రానైట్ రాళ్లతో నిర్మించారని, ఇంటీరియల్ గోడల మాదిరిగా చుట్టూ సాధారణ రాళ్లను పేర్చారని పురావస్తుశాఖ అధికారులు పేర్కొన్నారు. గతంలో మధ్య యుగానికి చెందిన కొన్ని ఎరుపు రంగు మట్టి పాత్రల శకలాలు ఈ చుట్టు పక్కల ప్రాంతాల్లో దొరికాయని, తమ పరిశోధన పూర్తయ్యేంత వరకు భూమిని చదును చేసే పనులను ఆపాలని ఆర్మీ అధికారులను పురావస్తు శాఖ విజ్ఞప్తి చేసింది.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
ఆదివారం
23 -08-2026

# సెప్టెంబర్ 10లోపు రూ.500ల బోనస్‌కు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి.

## ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్ రైతులను కోరారు..



ఎడపల్లి, ఆగస్టు 22: (ప్రజా గళం): 2026 వాన కాలం సీజన్ సన్న వరి సాగు చేసే రైతుల కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించిం ది.ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిన ఏడు ప్రత్యేక సన్న వరి రకాలను సాగు చేస్తున్న రైతులకు మద్దతు ధరకు అదనంగా రూ.500 బోనస్ చెల్లించనున్నట్లు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్ చెప్పారు. అర్హులైన రైతులకు,ఈ ఆర్థిక లబ్ధిని పొందడా నికి సెప్టెంబర్ 10 లోపు తమ సాగు వివరాలను తప్ప నిసరిగా నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు విత్తనాలు పొందిన మార్గాన్ని బట్టి నమోదు ప్రక్రియను రెండు వర్గాలుగా వర్గీకరించారని అయన తెలిపారు.గుర్తింపు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొను గోలు చేసిన రైతుల వివరాలను డీలర్లే స్వయంగా పోర్ట ల్లో నమోదు చేస్తారన్నారు.అలాగే సొంత విత్తనాలు, ఇతర రైతుల వద్ద లేదా పరిశోధనా స్థానాల నుంచి విత్తనాలు పొందిన వారు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారికి రైతు ధ్రువీ కరణ పత్రం సమర్పించా ల్సి ఉంటుందని పేర్కొన్నారు.సన్న వరి సాగు చేసిన ప్రతి ఒక్క రైతుకు న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని,గడువు ముగిసేలోగా రైతులందరు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఆయన వ్యవసా య శాఖ అధికారి సిద్ధిరామేశ్వర్ కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కల సాకారం. : టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

నిజామాబాద్ ఆగస్టు 22 ( ప్రజాగళం ప్రతినిధి) పేదల జీవిత స్వప్నమైన సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన అనంతరం ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గానికి 3,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అదనంగా నిజామాబాద్ జిల్లాకు మరిన్ని ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా




ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదల మేలు కోరే కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు.

# యూరియా కొరతపై రైతన్నల ఆందోళన : ఈరవత్రి రాజశేఖర్ మద్దతు



ఆర్మూర్, ఆగస్టు 22 (ప్రజగళం ): ఆర్మూర్ పట్టణంలో శనివారం రైతన్నలు చేపట్టిన యూరియా కొరత ఆందోళనకు ఈర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, మద్దతు తెలిపారు. యూరియా యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.ఆర్మూర్ ప్రాంత రైతాంగం చైతన్యవంతమైనదని, యూరియా అందుబాటులో లేకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. ఎకరానికి మూడు యూరియా సంచులు అందించాలని కోరారు.అన్నదాతల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం సరికాదని, యూరియా సరఫరా విషయంలో పాలకుల వైఖరిని ఖండిస్తున్నామని తెలిపారు. ఇకనైనా రైతుల ఆవేదనను అర్థం చేసుకుని పంటలను కాపాడేలా తగినంత యూరియాను అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు వంద శాతం న్యాయం జరిగే వరకు తమ మద్దతు కొనసాగుతుందని ఈరవత్రి రాజశేఖర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఈ ఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, రామ్ చందర్, నూకల శేఖర్, వినోద్, దినేష్, శ్రావణ్, కర్తన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటోడ్రైవర్ల బంద్ కు సంపూర్ణ మద్దతు.

## తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత.

నిజామాబాద్ ఆగస్టు 22 (ప్రజా గళం ప్రతినిధి ) న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఈనెల 24 నుంచి తలపెట్టిన బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తెలిపారు. శనివారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీఆర్టీయూ) సహా పలు ఆటో యూనియన్ ల నాయకులతో కలిసి బంద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ఆర్టీసీ యాజమాన్యానికి ఈవీ ఆటోలు ఇచ్చి లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ప్రారంభించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ సర్వీస్ ను ఇప్పుడున్న ఆటోడ్రైవర్లతో నడిపించాలని డిమాండ్ చేశారు. ఆటో, ట్రాన్స్ పోర్ట్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని.. ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా ప్రభుత్వమే యాప్ తీసుకురావాలని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12




వేల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. శిశువు మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కామారెడ్డి జీజీహెచ్ లో శిశువు మృతిపై ఎక్స్ (ట్విట్టర్)లో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవం కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన ఎక్కపల్లి తండాకు చెందిన గర్భిణికి సకాలంలో డెలివరీ చేయకపోవడంతోనే శిశువు మృతిచెందిందని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు తరచు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. శిశువును కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

# అర్బన్ లో డబుల్ బెడ్ రూమ్ టవర్లు నిర్మించాలి.

## అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి..

## అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.




నిజామాబాద్,ఆగస్ట్ 22,ప్రజాగళం:నియోజకవర్గంలో స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించి ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నగరంలో పేదలకు స్థలం ఉండే అవకాశం లేదని, కావున ప్రభుత్వ స్థలంలోనే హైదరాబాద్ తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించాలని కోరారు. ప్రధానంగా రెండు దశల్లో గత 12 సంవత్సరాలుగా తెలంగాణలో డబుల్ బెడ్ రూం ఇళు ఇవ్వని నియోజక వర్గం కేవలం నిజామాబాద్ అర్బన్ మాత్రమే అన్నారు. ఇప్పటికైనా ఇవ్వడం సంతోషకరమన్నారు. ఇటీవల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ఇందిరమ్మ ఇల్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకి సంబంధించి పలు అంశాలను తీసుకెళ్లానని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య యత్నం.

## ఎస్కార్ట్ పోలీసుల కళ్ళు గప్పి 3అంతస్తు పై నుండి దూకిన రిమాండ్ ఖైదీ.

నిజామాబాద్ క్రైమ్ ఆగష్టు 22( ప్రజాగళం ) నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పోలీసుల కట్టుదిట్టమైన భద్రత మధ్య ఓ రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్కార్ట్ పోలీసుల నుండి తప్పించుకొని మూడవ అంతస్తు నుండి కిందికి దూకాడు.

ఒకటవ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల భిక్కనూరు పోలీస్ స్టేషన్‌లో లకావత్ రాజు అనే వ్యక్తిపై కేసు నమోదైందని కేసులో భాగంగా అతడిని సారంగపూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. శనివారం సాధారణ వైద్యపరీక్షల్లో భాగంగా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి అతడిని తీసుకొచ్చారన్నారు.. అయితే జైలు ఎస్కార్ట్ పోలీసుల మధ్య ఉన్న లకావత్ రాజు వారిని తప్పించుకుని జీజీహెచ్ ఆసుపత్రి మూడవ అంతస్తు నుంచి కిందికి




దూకడన్నారు . దీంతో అతడి తలకు, ఛాతిలో బలమైన గాయాలయ్యాయి. హఠాత్తుగా జరిగిన ఈ ఘటన నుంచి తేరుకున్న పోలీసులు వెంటనే రాజును జీజీహెచ్?లోని ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన జీజీహెచ్?లో కలకలం రేపింది.

# ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.

నిజామాబాద్ జిల్లా అభివృద్ధిపై మరోసారి సమగ్ర సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్ ఉమారాణి, డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, బొబ్బిలి రామకృష్ణ, కవితరెడ్డి, పట్టణ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
ఆదివారం
23 -08-2026

# కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు.

## హైదరాబాద్ తరహాలో నిజామాబాద్ లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థల పరిశీలన. : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి.

నిజామాబాద్, ఆగస్టు 22 ( ప్రజాగళం ప్రతినిధి ) కుల, మత తారతమ్య భేదం లేకుండా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ నగరంలో శనివారం మంత్రి పలు ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల కోసం నిర్మించనున్న హౌసింగ్ టవర్స్ స్థలాన్ని పరిశీలించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆరు అంతస్తులతో కూడిన టవర్స్ నిర్మించనున్న నేపథ్యంలో తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం 43వ డివిజన్ లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో మంత్రి పొంగులేటి భేటీ అయ్యారు. ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, సకాలంలో బిల్లులు వచ్చాయా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ సొంత ఇంటి కలను సాకారం చేసిందని లబ్దిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా తమ కృతజ్ఞతలు తెలియజేయాలని మంత్రిని కోరారు. లబ్దిదారులను కలిసి వారి సంతోషంలో పాలు పంచుకోవడం తనకు కూడా ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి హర్షం వెలిబుచ్చారు. లబ్ధిదారులకు గృహ ప్రవేశ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన వస్త్రాలు బహూకరించారు. చివరి దశ నిర్మాణంలో ఉన్న ఇళ్లను సైతం సందర్శించి, త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్దిదారులకు సూచించారు. అక్కడి నుండి ఐ.డీ.ఓ.సీని ఆనుకుని నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ళను మంత్రి పొంగులేటి పరిశీలించారు. తక్షణమే పెండింగ్ పనులను పూర్తి చేయాలని కంట్రాక్టర్ ను ఆదేశించారు. నిధుల కొరత ఎంతమాత్రం లేదని, పనులు పూర్తి చేసిన 24 గంటల వ్యవధిలో బిల్లులు మంజూరు చేస్తామని అన్నారు. గుత్తేదారుతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి, డబుల్ బెడ్ రూమ్ భవన సముదాయాన్ని స్వాధీనపర్చుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, సానిటేషన్ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు.



లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ.

స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, గృహ నిర్మాణ సంస్థ ఎం.డీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు ఈ సంరంభంలో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి విడతలో రాష్ట్రంలో 4.50 లక్షల ఇళ్ళను మంజూరు చేశామని, రెండవ విడతలో 2.5 లక్షల ఇళ్ళను, హైదరాబాద్ లో లక్ష ఇళ్ళను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్ళను తమ ప్రభుత్వం పేదలకు అందిస్తోందని మంత్రి అన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేసేంత వరకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కమీషన్ లకు ఆశపడి కాళేశ్వరం కట్టారు కానీ, పదేళ్ల కాలంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని మంత్రి పొంగులేటి ఆక్షేపించారు. గత ప్రభుత్వం ఒకవేళ ఏడాదికి రెండు లక్షల చొప్పున ఇండ్లు ఇచ్చి ఉంటే, నేడు తెలంగాణ రాష్ట్రంలో పేదలందరికీ సొంత ఇండ్లు సమకూరేవని అన్నారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన, మొండి గోడలకే పరిమితమైన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను సైతం పూర్తి చేసి, లబ్దిదారులకు కేటాయించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్ నగరంలో ప్రస్తుతం 400 మంది లబ్దిదారులకు రెండు పడక గదుల ఇళ్ళను పంపిణీ చేస్తున్నామని, వారం పది రోజుల్లో మరో 300 మందికి అందజేస్తామని అన్నారు. ఇళ్ళ కేటాయింపులు పూర్తి పారదర్శకంగా జరిగేలా, అర్హులైన వారికే దక్కేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. పట్టణాలు, నగరాలలో ఇళ్ళ స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలోనే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే నిజామాబాద్ నగరంలో హౌసింగ్ బోర్డుకు చెందిన నాగారం నిర్మితి కేంద్రం వద్ద ప్రయోగాత్మకంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో 8.20లక్షల కోట్ల రూపాయల అప్పుల భారంలో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ, ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే సంకల్పంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రూపాయి ఖర్చు లేకుండా పేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని అన్నారు. పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన పేదలకే ఇళ్లు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారి పేరిటే ఇందిరమ్మ ఇండ్లు, ఇతర సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా బోధన జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగానే ఏడాది కాలంలోనే మొదటి విడత కింద 4.50లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని వివరించారు. ఓ వైపు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత విద్యుత్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు సమాంతరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అయినప్పటికీ, ప్రతిపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, సంక్షేమాభివృద్ధికి పాటుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలవాలని ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ కోరారు. ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డిలు మాట్లాడుతూ, డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ పట్ల హర్షం వెలిబుచ్చారు. మంత్రి వెంట సీ.పీ సాయి చైతన్య, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

నిజామాబాద్ : రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ది పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి గారు సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా మంత్రిగారు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పేద కుటుంబాలపై నిర్మాణ భారం తగ్గించడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ, నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు.

హైదరాబాద్ తరహాలో నిజామాబాద్ లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థల పరిశీలన. : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఈ వారం 32 సైబర్ ఫిర్యాదులు స్వీకరణ

ఓటీపీ, లోన్ యాప్‌లు, సోషల్ మీడియా మోసాలపై ప్రత్యేక దృష్టి

ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు సంప్రదించాలి.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

ఆదిలాబాద్ ఆగస్టు 22 : ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఒక్కదాన్ని అనుమానాస్పదంగా పరిశీలించి నిర్ధారించుకున్న తర్వాతనే ముందుకు కొనసాగాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తతో వ్యవహరించిన వారు సైబర్ నేరాలకు గురి కాకుండా ఉంటారని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ వారం సైబర్ నేరాలకు సంబంధించి 32 ఫిర్యాదులు వచ్చినట్లు, ప్రజలను వివిధ రకాలుగా మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ల ద్వారా దర్యాప్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక నేరాలలో 1930 ను వినియోగించాలని సైబర్ క్రైమ్ ఫిర్యాదులను త్వరితగతన నమోదు చేసిన వారికి డబ్బు తిరిగి వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

జిల్లాలో నమోదైన పలు సైబర్ కేసుల వివరాలు.

1.డిజిటల్ లోన్ యాప్ పేరుతో మోసం

దుర్శెట్టి రాఘవ క్యాష్‌సహారా యాప్ ద్వారా రూ.5,000 రుణం చూపించగా, వాస్తవంగా రూ.3,000 మాత్రమే ఖాతాలో జమైందని ఫిర్యాదు చేశారు. అనధికారిక లోన్ యాప్‌లను ఉపయోగించవద్దని పోలీసులు సూచించారు.

2.క్రెడిట్ కార్డు ఓటీపీతో రూ.74,446 మోసం

ప్రఫుల్ పటేల్‌కు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ఉద్యోగిగా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, కార్డు అన్‌బ్లాక్ చేస్తామని చెప్పి ఓటీపీ తీసుకొని రూ.74,446/- నగదును మోసం చేశాడు.

3.ఇన్‌స్టాగ్రామ్ ఖాతా దుర్వినియోగం

సెర్లా స్నేహల్ చైతన్య పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా సృష్టించి, ఇతరులను డబ్బులు పంపాలని కోరుతూ తప్పుడు సందేశాలు పంపుతున్నట్లు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా ఖాతాలను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

4.వాట్సాప్ ద్వారా ఐఫోన్ పేరుతో మోసం నంద కిషోర్ జీ భార్యకు వాట్సాప్ కాల్ చేసి ఐఫోన్ ఇప్పిస్తామని నమ్మించి రూ.19,000/- మోసం చేసినట్లు ఫిర్యాదు నమోదైంది. ఆన్‌లైన్‌లో పరిచయం లేని వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పంపవద్దని సూచించారు.

5.ఫ్రాంచైజీ పేరుతో ఆన్‌లైన్ మోసం నిరంజన్‌కు యూట్యూబ్‌లో సోలార్ కంపెనీ ఫ్రాంచైజీ ఇప్పిస్తామని నమ్మించి ఆన్‌లైన్‌లో రూ.50,000/- చెల్లింపులు చేయించారు. డబ్బులు అందుకున్న అనంతరం నిందితులు ఫోన్‌లు బ్లాక్ చేసినట్లు ఫిర్యాదు చేశారు.

6.ఫోన్‌పే ద్వారా అనధికారిక నగదు బదిలీ

పాండిరి హరీష్ ఖాతా నుంచి తనకు తెలియకుండా ఫోన్‌పే ద్వారా గుర్తుతెలియని ఖాతాకు రూ.39,000/- బదిలీ అయినట్లు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద లావాదేవీ జరిగిన వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

జిల్లా ప్రజలు OTP, PIN, CVV, UPI PIN, బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేసి, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.



Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com